మహిళా దినోత్సవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని హెచ్ఎండీఏ మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బేగంపేటలోని పైగా ప్యాలేస్‌లో నిర్వహించిన ఈ వేడుకలకు హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి హాజరయ్యారు. మహిళలు అనుకుంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదని, ప్రతి ఒక్కరూ ఆత్మస్థైర్యంతో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏలోని వివిధ విభాగాల ఉద్యోగులు, ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు ఉమా పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, మార్చి10 (ఆంధ్రజ్యోతి)

కర్రీ పాయింట్‌లో అగ్నిప్రమాదం

- పేలిన గ్యాస్ సిలిండర్.. భయంతో జనం పరుగులు


మంటలను ఆర్పుతున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

ఖైరతాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న కర్రీ పాయింట్.. అందులో 4గ్యాస్ సిలిండర్లు. మధ్యాహ్నం వంటలు వండుదామని గ్యాస్‌ను ఆన్ చేయగా దాని పైపు నుంచి గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో మంటలు ఎగిసి పడడం, అందులోని గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో ఒక్కసారిగా ఖైరతాబాద్ మార్కెట్ చౌరస్తాలో భయానక వాతావరణం కనిపించింది. ఫైర్ ఇంజన్ వచ్చేవరకు పోలీసులు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించినా ఫైర్ శాఖ సిబ్బంది వచ్చేవరకు నిలువరించలేకపోయారు. ఖైరతాబాద్ మార్కెట్ చౌరస్తాలో మహాలక్ష్మి కర్రీ పాయింట్ ఉంది. ఇందులో మధ్యాహ్న భోజనంతో పాటు కర్రీలు అమ్ముతుంటారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో బ్రహ్మచారి అనే వ్యక్తి వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పైప్ లీక్ కావడంతో మంటలు వచ్చాయి. వాటిని అదుపుచేసేందుకు ప్రయత్నించినా సాధ్యపడకపోవడంతో అతడు బయటకు పరుగులు తీశాడు. ఇంతలోనే మంటలు ఎగిసిపడి గ్యాస్ సిలిండర్ పేలింది. ఆసమయంలో భారీ శబ్దంతో మంటలు బయటకు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వారి ద్వారా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో అక్కడున్నకర్రీపాయింట్ నిర్వాహకుడు బ్రహ్మచారికి స్వల్ప గాయాలయ్యాయి. ఫైర్ ఇంజన్ వచ్చేవరకు పోలీసులు మంటలను ఆర్పేందుకు తీవ్రంగా కృషి చేశారు. కాగా చిన్న పాటి కర్రీ పాయింట్‌లో 4 గ్యాస్ సిలిండర్లు ఉంచడం, భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నిర్వాహకులు బ్రహ్మచారి, ఓంప్రకాష్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. గ్యాస్ సిలిండర్లను ఫైర్ సిబ్బంది బయటకు తెచ్చి వాటిని చల్లబరచడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లిన యువకుడి అదృశ్యం

యుసుఫ్‌గూడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. రహ్మత్‌నగర్‌లో నివాసం ఉంటున్న టి.స్వరూపరాణి, టి.శ్రీనివాస్‌చంద్ర ప్రవేట్ ఉద్యోగి. వీరు గతంలో యాదగిరి నగర్‌లో నివాసం ఉండేవారు. మూడు నెలల క్రితం రహ్మత్‌నగర్‌కు వచ్చారు. వీరి కుమారుడు సుభాష్‌చంద్ర యాదగిరి నగర్‌లో ఉండే సమయంలో పంజాగుట్టలోని ఓ జ్యూవెలరీ షాప్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ మెరుగైన ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లాడు. తన స్నేహితుడితో కలిసి ఉంటూ ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పాడు. ఇటీవల స్వరూపరాణి కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో అతని స్నేహితుడు మణికంఠకు ఫోన్ చేయగా మీ అబ్బాయి బాగానే ఉన్నాడు.. ఉద్యోగం చేసుకుంటున్నాడని, అతని ఫోన్ పగిలి పోయిందని చెప్పడమే కానీ.. ఫోన్‌లో మాట్లాడించడంలేదు. దీంతో స్వరూపరాణి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేటుగాళ్ల అరెస్ట్

- 3.4 కిలోల గంజాయి పట్టివేత

మోతినగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలో మరోసారి గంజాయి కేటుగాళ్ల ఆట కట్టించారు నగర పోలీసులు. సోమవారం మాదాపూర్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో మొత్తం 3.4 కేజీల గంజాయితో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసు కథనం మేరకు... మాదాపూర్ 100ఫీట్ రోడ్ సమీపంలోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భూముల సమీపంలోని సిగ్నల్ వద్ద ఒడిశాకు చెందిన గగన్ కుమార్ బెహరా అనే యువకుడిని అదుపులోకి తీసుకొని 1.9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ సమీపంలోని సిద్ధిక్ నగర్ ప్రాంతంలో జరిపిన దాడుల్లో ఒడిశాకు చెందిన కుషాల్ ప్రధాన్, మిథునా థాయ్ అనే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 1.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురి యువకులపై మాదాపూర్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మాదాపూర్ పోలీసులు తెలిపారు.

ఐఆర్‌సీటీసీ పేరుతో ఆన్‌లైన్‌లో నగదు మాయం

యుసుఫ్‌గూడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఐఆర్‌సీటీసీ నుంచి కాల్ చేస్తున్నాం... మీరు టికెట్ క్యాన్సిల్ చేయాలంటే ఈ నెంబరుకు ఫోన్ చేయండి అని ఫోన్ చేయగానే ఆమె అకౌంట్ నుంచి నగదు మాయమైంది. ఈ సంఘటనపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రహ్మత్‌నగర్‌లో నివాసం ఉంటున్న గోపిశెట్టి కుమారి అనే మహిళ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. ఈనెల 10వ తేదీ ఏలూరు నుంచి బేగంపేటకు ఐఆర్‌సీటీసీ రైల్వే వెబ్‌సైట్ నుంచి టికెట్ బుక్ చేసింది. కొన్ని గంటల తర్వాత ఆ టికెట్ క్యాన్సిల్ చేయడానికి కస్టమర్ కేర్ నెంబర్ కోసం వెతికింది. దీంతో గుర్తుతెలియని నెంబరు నుంచి ఆమెకు ఫోన్ వచ్చింది. ఐఆర్‌సీటీసీ నుంచి ఫోన్ చేస్తున్నామని.. మీరు టికెట్ క్యాన్సిల్ చేయాలంటే 403 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. దీంతో ఆమె ఆ నెంబరుకు ఫోన్ చేసింది. ఫోన్ చేయగానే ఆమె ఫోన్ హ్యాక్ అయింది. వెంటనే ఆమె ఖాతా నుంచి రూ.78.974నగదు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి కొంత నగదు బ్లాక్ చేయించింది. అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

బోరబండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా బెల్ట్ షాపు నిర్వాహిస్తూ మద్యంతో పట్టుబడిన ఓ వ్యక్తిపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి మద్యం బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారుగా రూ.10వేలు ఉంటుంది. బోరబండ వినాయకరావునగర్‌కు చెందిన సీహెచ్ శ్రీరాములు(44) బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు దాడులు చేసి మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. బెల్ట్ షాపులకు పంపిణీ చేసే వైన్ షాపుల యజమాన్యులపై కేసులు ఉంటాయని సీఐ ఎస్‌వీ శేఖర్ హెచ్చరించారు.

ముగ్గురి రిమాండ్

బంజారాహిల్స్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి బర్త్‌డే పార్టీలో ఫుల్‌గా మద్యం తాగారు.. అదే మత్తులో కారు నడుపుతూ జూబ్లీహిల్స్‌లో డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో కారు ధ్వంసం కాగా, కారు నడిపిన యువకుడితో పాటు మరో ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్‌కు చెందిన మల్లికార్జున్‌రెడ్డి కారు డ్రైవర్. మణికొండలో ఉండే విశాల్ అనే స్నేహితుడి పుట్టిన రోజు కావడంతో ఈనెల 10న మల్లికార్జున్‌రెడ్డి, సంతోష్, అరవింద్ మరో జువైనల్ కారులో వెళ్లారు. బర్త్‌డే పార్టీలో ఫుల్‌గా మద్యం తాగారు. తిరుగు ప్రయాణంలో జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు-45కు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఎవరికి ఏం కాలేదు. కారు నడుపుతున్న మల్లికార్జున్‌రెడ్డికి శ్వాస పరీక్ష చేయగా 127 వచ్చింది. మిగతా ఇద్దరు కూడా మద్యం తాగినట్టు నిర్ధారణ కావడంతో జూబ్లీహిల్స్ పోలీసులు ముగ్గురిపై 279,336 ఐపీసీతో పాటు మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత్తుపదార్థాలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బల్కంపేటలో ఓవ్యక్తి నుంచి 5ఎల్ఎస్‌డీ పేపర్లు (మత్తుమందు) మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. బల్కంపేట బీజేఆర్ నగర్‌కు చెందిన కుమ్మరి విశాల్‌సాయి లా విద్యను అభ్యసిస్తున్నాడు. ఎస్ఓటీ పోలీసులు విశాల్ సాయిని అదుపులోకి తీసుకొని అతని దగ్గర నుంచి ఎల్ఎస్‌టీ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

ఆక్రమణదారులకు వత్తాసు

- కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు
- మధ్యవర్తులతో రెవెన్యూ సిబ్బంది దందా
- షేక్‌పేటలో కనుమరుగవుతున్న ఖరీదైన స్థలాలు


ప్రభుత్వ స్థలంలో వెలిసిన గుడిసెలు

బంజారాహిల్స్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన రెవెన్యూ సిబ్బంది ఆక్రమణదారులకే వత్తాసు పలుకుతున్నారు. కబ్జా అవుతుందని తెలిసినా తమకు వచ్చే లాభాలు లెక్కలు వేసుకుంటున్నారు తప్పితే.. వాటిని రక్షించే దిశగా ప్రయత్నాలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫిలింనగర్ బస్తీల్లో రెవెన్యూ సిబ్బంది మధ్యవర్తుల ద్వారా దందాకు తెరలేపుతున్నారు. దీంతో ఖరీదైన స్థలాలు కనుమరుగవుతున్నాయి. జూబ్లీహిల్స్ డివిజన్ పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. రాజకీయ ముసుగులో ఎవరికి వారు స్థలాలను ఆక్రమించి గుడిసెలు, నిర్మాణాలు చేపడుతున్నట్టు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. బస్తీ వాసులు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ సిబ్బంది బేరాలు కుదుర్చుకొని బ్యాంకు బ్యాలెన్స్ పెంచుకుంటున్నారు. ఫిర్యాదులు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు.

పాక్షికంగా కూల్చివేసి..

బస్తీకి అనుకొని ఉన్న చిన్న గుట్టపై స్థానిక రాజకీయ నాయకుడి బంధువు కన్ను పడింది. రెండు సంవత్సరాల క్రితం అధికారుల కళ్లు కప్పి ఓ గదిని నిర్మించాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీంతో ఈ స్థలం జోలికి రాలేదు. తాజాగా ప్రభుత్వ మారింది. అందరూ హడావిడిగా ఉంటారని భావించిన నాయకులు తాజాగా 50 గజాల స్థలంలో గుడిసె వేశాడు. దీన్ని ఆసరా చేసుకొని చుట్టూ ఉన్న మరో రెండు వందల గజాల స్థలాన్ని కాజేయాలనేది అతడి ఉద్దేశ్యం. ఈవిషయంలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో సిబ్బంది పాక్షికంగా కూల్చివేశారు. తర్వాత సిబ్బందితో సదరు నేత బంధువు మాట్లాడుకోవడంతో కబ్జా చేసేందుకు అనుమతించినట్టు సమాచారం. మరో ఆటో డ్రైవర్ కూడా దర్జాగా బస్తీలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసుకొని పక్కా నిర్మాణం పూర్తి చేసుకున్నాడు. ఇదంతా సిబ్బంది కనుసన్నల్లోనే జరిగిందని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు.

ఇదీ విషయం

పద్మాలయ అంబేడ్కర్ చుట్టూ ఎఫ్‌డీసీకి సంబంధించిన స్థలం ఉంది. ప్రభుత్వం పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చింది. పట్టాలకు పోను మిగతా స్థలాన్ని ఆక్రమించుకుంటే సహించేది లేదని గతంలోనే అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు పట్టాల ప్రకారం స్థానికులు నిర్మాణాలు చేపట్టారు. ఇవి పోను బస్తీ చుట్టూ, నిర్మాణాల మధ్య ప్రభుత్వ స్థలాలు మిగిలాయి. వీటిపై బస్తీ నాయకుల కన్ను పడింది. ఎలాగైన వాటిని ఆక్రమించుకొని అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని గతంలో అనేక సందర్భాల్లో ప్రయత్నాలు చేశారు. కానీ అప్పటి రెవెన్యూ అధికారులు కూల్చివేతలు నిర్వహించడంతో పాటు కేసులు కూడా పెట్టారు. తాజాగా బస్తీలో ఆక్రమణలు పెరిగిపోయాయి. బస్తీలో రెండిళ్లు ఉన్న వారు కూడా దర్జాగా స్థలాలను కబ్జా చేసేస్తున్నారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ నాయకురాలి ఇద్దరు కుమారులకు కూడా పట్టాలు వచ్చాయి. వీటిలో ఓ కుమారుడు మూడు అంతస్థుల ఇంటి నిర్మాణం చేపట్టాడు. మరో కుమారుడు ఉండటానికి ఇళ్లు నిర్మించుకున్నాడు. బీఆర్ఎస్ నాయకురాలు ఇప్పుడు బస్తీని ఆనుకొని ఉన్న స్థలంపై కన్నేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆక్రమించేందుకు గుడిసె వేసింది. సమాచారం అందుకున్న అప్పటి రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఆమె వెనుకడుగు వేయలేదు. వీకెండ్ సెలవులను ఉపయోగించుకుంటూ గుడిసెను పగడ్బందీగా వేసుకుంది. అంతే కాదు విద్యుత్ మీటర్ కూడా తెచ్చుకున్నారు. ప్రభుత్వ స్థలానికి ఎటువంటి దస్తావేజులు లేకుండా ట్రాన్స్‌కో అధికారులు ఎలా మీటరు ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. కబ్జా చేసిన మహిళకు, రెవెన్యూ సిబ్బంది మధ్య ఓ మధ్యవర్తి రాజీ కుదిర్చినట్టు బస్తీలో గుసగుసలు వినిపిస్తున్నారు. బస్తీలో ప్రస్తుతం నిర్మాణాలు ఉన్న కొన్ని ప్రాంతాల్లో ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. వాటికి సమీపంలో ఉన్న కొంతమంది ఖాళీ ప్లాట్లను తమ స్థలంలో కలిపేసుకునేందుకు పథకం వేస్తున్నారు. ఎలాగైన తమ ఆధీనంలోకి తీసుకొని జీవో 58 క్రమబద్ధీకరణ ద్వారా దరఖాస్తు చేసుకోవాలనేది వారి ఆలోచన. ఇక బస్తీకి ఆనుకొని ఉన్న గుట్టమీద ఇద్దరు లీడర్లు గుడిసెలు వేసుకునేందుకు కావాల్సిన సరంజామాను సిద్ధం చేసుకున్నారు. అవకాశం లభించినప్పుడు గుడిసె వేసుకోవాలనేది వారి పథకమని తెలుస్తోంది.

పట్టా ఉన్నా డబ్బు కావాలట

బస్తీలో అందరి మాదిరిగానే ఓ వ్యక్తికి పట్టా వచ్చింది. అతడికి కేటాయించిన స్థలం రోడ్డులో వెళ్లడంతో పక్కనే ఉన్న ఖాళీ స్థలం కేటాయించాలని సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు. ఇటీవలె ఓ రెవెన్యూ ఉద్యోగి ఐదు లక్షల రూపాయలు ఇస్తే గానీ స్థలం కేటాయించడం కుదరని చెప్పినట్టు తెలిసింది. ఆర్థిక స్తోమత లేని ఆ వ్యక్తి ప్రభుత్వం పట్టా ఇచ్చినా ఎందుకు పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా షేక్‌పేట రెవెన్యూ సిబ్బందిపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే విలువైన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఉంటాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.


అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

బంజారాహిల్స్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమణకు గురవుతున్నాయి. ఓ వైపు అధికారులు కూల్చివేతలు చేపడుతుండగానే మరోవైపు రాజకీయ ముసుగులో నాయకులు ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ ప్లాట్ల కింద మార్చుతున్నారు. తాజాగా ఓ బీఆర్ఎస్ కార్యకర్త ఏకంగా రాక్‌గార్డెన్‌కు అనుకొని ఉన్న బస్తీలో నిర్మాణాలు చేపడుతుండగా, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేతలు చేట్టారు. ఫిలింనగర్‌లోని వినాయనగర్, రాక్‌గార్డెన్ మధ్య పర్వతాంజనేయ స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంపై స్థానిక బీఆర్ఎస్ కార్యకర్త రమణయ్య కన్నేశాడు. సుమారు రెండువందల గజాల స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు గతంలో ప్రయత్నించగా, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తాజాగా రమణయ్య వరుస సెలవులను దృష్టిలో పెట్టుకొని వేగంగా నిర్మాణాలు చేయడం మొదలు పెట్టాడు. పిల్లర్లు వేసి కట్టడాలు చేస్తుండగా సమాచారం అందుకున్న షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది నిర్మాణాలను ఆపాలని హెచ్చరించారు. అతడిపై ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రిమినల్ కేసు కూడా నమోదు అయింది. అయినప్పటికీ రమణయ్య పనులు ఆపకుండా చేపడుతున్నాడు. దీంతో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సోమవారం నిర్మాణాల వద్ద కూల్చివేతలు చేపట్టారు. గోడలు, పిల్లర్లను తొలగించారు. మరోసారి నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


ప్రైవేట్ స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోరబండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మోతీనగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యాక్షుడు బి.విజయ్, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రైవేట్ పాఠశాల ఎదుట బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అత్యాచారం ఘటనలో బాధిత బాలిక, బాధితుడు అదే స్కూల్ అయినప్పటికీ బాధిత కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యం కనీసం ఓదార్చ లేదన్నారు. ఇప్పటికైనా బాధిత కుటుంబానికి బరోసానిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, రామకృష్ణ, రాజు, గాంధీ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

యుసుఫ్‌గూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఒకసారి వాడి పారేసే(సింగిల్ యూజ్ ప్లాస్టిక్)పై ఈనెల 13వతేదీ యూసుఫ్‌గూడ నిమ్స్‌మేలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ప్లాస్టిక్ నిషేదంలో భాగంగా ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఎగుమతులు, వ్యాపారాలపై ఆధారపడ్డ వారికి ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించే అంశాలపై కూడా ఈఅవగాహన కార్యక్రమం ఉంటుంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అండ్ ఆల్టర్నేటివ్ మెటీరియల్స్ అనే అంశంపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు వర్క్‌షాప్ డైరెక్టర్ జె.కోటేశ్వరరావు తెలిపారు. ప్లాస్టిక్ వాడకంవల్ల కలిగే దుష్ప్రభావాలను నివారించేందుకు ప్లాస్టిక్ సంచులు, వస్తువులు తయారీ దారులు, దిగుమతి దారులు, పంపిణీ దారులు, విక్రయ దారులు, ఫార్మా కంపెనీలకు చెందిన పారిశ్రామిక వేత్తలకు ఈ అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఈసదస్సులో పాల్గొనేందుకు ఉచిత ప్రవేశం కోసం నిమ్స్‌మే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 81062 56066ను సంప్రదించవచ్చు.

ఇంటి భోజనం ఆరోగ్యానికి మంచిది


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్, ఫ్లో సభ్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో దొరికే, సీజనల్ ఫుడ్స్‌తో పాటుగా మరీ ముఖ్యంగా ఇంటి భోజనం ఆరోగ్యానికి మంచిదని సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నలభై ఏళ్ల వయసు నుంచే ఆరోగ్య పరంగా గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటాయని, ఈ వయసులో మహిళల కోసం 40+ మంత్ర వివరించారు. సరిగా తినకపోతే లేదంటే తినాల్సిన ఆహారం తినకపోతే పీరియడ్స్ సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని ఆమె వివరించారు. ఆకుకూరలు, శెనగలు, పెసరపప్పు, అరటి పండ్లు లాంటి తాజా పండ్లు లాంటివి తీసుకోవాలని సూచించారు. మంచి నిద్ర సౌందర్యానికి ముఖ్యమని, ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఫ్లో హైదరాబాద్ చైర్ పర్సన్ రీతు షాతో పాటుగా పెద్ద సంఖ్యలో ఫ్లో సభ్యులు పాల్గొన్నారు.

నేవీ అధికారులుగా ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థులు


పీజీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు

ఖైరతాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తమ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో ఉత్తమ శిక్షణ పొందుతూ త్రివిధ దళాల్లో ఉద్యోగాలు సంపాదించాలనే లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నారని సైఫాబాద్ పీజీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ అన్నారు. ఇటీవలే విడుదలైన నౌకాదళం ఉద్యోగాల ఫలితాల్లో కళాశాలకు చెందిన సాయివీర్, రాజ్‌కుమార్ అనే విద్యార్థులు ఎస్ఎస్ఆర్ అధికారులుగా ఎంపికవడంపై సోమవారం వారిని కళాశాల ఆధ్వర్యంలో అభినందించారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పల్నాటి నరేష్ ఇస్తున్న కృషి వల్లే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రిన్సిపల్ తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు సన్మానం


క్రీడాకారులను సన్మానించిన దృశ్యం

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను సోమవారం టీకేగూడలోని యాష్‌జిమ్‌లో సన్మానించారు. చందానగర్‌లో శని, ఆదివారాల్లో జరిగిన పోటీల్లో పతకాలు సాధించిన జూనియర్ గ్రూప్‌లో సోను, స్వప్నిక్, భార్గవ్‌రాం, విన్నీల, సీపీయార్ గ్రూప్‌లో సాయిరాం, నాగజ్యోతి, మాస్టర్ గ్రూప్‌లో బాలకృష్ణ, మిత్ర, సబ్ జూనియర్స్ గ్రూప్‌లో విశాల్ యాదవ్, నిఖిల్‌రెడ్డి, కునల్, మనిషాగౌడను తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్ సన్మానించారు. రంగారెడ్డి జిల్లాకు బృందానికి రన్నర్ అప్‌గా రెండోవ స్థానంతో టీం చాంపియన్ షిప్‌ను సాధించడంపై ఆయన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్‌రాజ్, దండు మల్లేష్‌గౌడ్, బొడ్డు ప్రసాద్‌గౌడ్, జ్ఞానప్రకాష్, కొండల్‌రావు, బాలకృష్ణ, రాజాశేఖర్, కృష్ణగౌడ్, ఆవుల నరసింహ, శివగౌడ్, శ్రీకాంత్ గుప్తా, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టెట్ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులు పెంచాలి


విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించిన ఆర్.కృష్ణయ్య

ఖైరతాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షను నిర్వహించిన అనంతర 25 వేల పోస్టులకు డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిరు. దీనికి పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున నిరుద్యోగులను తరలించేందుకు ప్రయత్నించగా ప్రభుత్వం ఆయా జిల్లాల్లోనే నిరుద్యోగులను అడ్డుకొని అరెస్టులు చేశారని సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. సోమవారం సైఫాబాద్‌లోని పాఠశాల విద్యా శాఖ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి అభ్యర్థుల ధర్నాకు ఆర్.కృష్ణయ్య మద్దతు ప్రకటించి రోడ్డుపై బైఠాయించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ... టెట్ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అవరోధాలు లేకున్నా ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. నిరుద్యోగుల ఆందోళనను అర్థం చేసుకొని ప్రభుత్వం టెట్‌తో పాటు డీఎస్సీని ఒకేసారి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షుడు జి.అనంతయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణయ్య నేతృత్వంలో ప్రతినిధి బృందం విద్యాశాఖ డైరెక్టర్ బొర్రా వెంకటేశంకు వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికుల కృతజ్ఞతలు

పంజాగుట్ట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు బాండ్ల డబ్బులు చెల్లించినందుకు, పీఆర్సీ 21శాతం ఫిట్మెంట్ ప్రకటించినందుకు టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఐ.ఎన్.టీ.యూ.సీ) ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. మిగిలిన సమస్యలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని యూనియన్ సెక్రటరీ జనరల్ హనుమంతు ముదిరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, ఆదనపు ప్రధాన కార్యదర్శి జి.అబ్రహం, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈనెల 12న జరిగే క్యాబినెట్ సమావేశంలో సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

'ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి'

పంజాగుట్ట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు. దాదాపు 25వేల టీచర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాల్సి ఉండగా కేవలం 11 వేల ఉద్యోగాలను మాత్రమే నోటిఫికేషన్‌లో ప్రకటించడం శోచనీయమన్నారు.



సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ట్రాన్స్‌కో సీఎండీ

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో పరిధిలో భారీగా విద్యుత్ డిమాండ్ నమోదవుతున్న తరుణంలో సీఎండీ ముషరఫ్ ఫరూఖి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మెట్రో జోన్ పరిధిలోని సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సబ్ స్టేషన్ నిర్వహణ, పీటీఆర్ లోడ్, ఫీడర్ల నిర్వహణ పలు అంశాలను పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని, విద్యుత్ సరఫరా విషయంలో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ నర్సింహులు, ఇతర అధికారులు వెంట ఉన్నారు.

'ఆటోరిక్షాలపై చర్యలు తీసుకోవాలి'

పంజాగుట్ట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలో చట్టవిరుద్ధంగా నడుస్తున్న ఆటోరిక్షాలపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సిటీ ఆటో రిక్షా పర్మిట్ హోల్డర్స్ అసోసియేషన్, తెలంగాణ ఆటో యూనియన్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగర పర్మిట్ కలిగిన ఆటో రిక్షా యజమానుల హక్కులను కాపాడాలని అసోసియేషన్ కన్వీనర్, ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివానందం, అసోసియేషన్ కో-కన్వీనర్ మహమ్మద్ ఇబ్రహీం అహ్మద్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించడానికి సోమవారం తమ ఆటోలకు సిటీ పర్మిట్ అని స్టిక్కర్స్ అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నగరంలో ఆటో రిక్షా పర్మిట్ ఉన్న యజమానులు వ్యాపారం లేక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించాలని, తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

'నేనూ మోదీ కుటుంబ సభ్యుడినే'


వెంకటగిరిలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

యుసుఫ్‌గూడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో 181,182,183 బూత్‌లలో బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు ప్రధాని నరేంద్రమోదీకి మద్దతుగా 'నేనూ మోదీ కుటుంబ సభ్యుడినే' అంటూ కార్యక్రమం నిర్వహించారు. బారత దేశం మొత్తం మోదీ తన కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో మరోసారి ప్రజలు మోదీకి అధికారం ఇవ్వాలని కోరుతున్నామని, బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పులిరామ్, బడుగు సతీష్, రాజేందర్ గుప్తా, మోహన్, రాణిబాయ్, విజయ్, లక్ష్మణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

- పంజాగుట్ట: వెంగళరావునగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నందికాశి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీకి మద్దతుగా 'నేను మోదీ కుటుంబ సభ్యుడుననే' వివిధ ప్రాంతాల్లో బీజేపీ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. డివిజన్‌లోని కల్యాణ్‌నగర్ చౌరస్తా, ఎస్.ఆర్‌నగర్ చౌరస్తా, మధురానగర్ చౌరస్తా, వెల్లంకి ఫుడ్స్ దగ్గర, వెంగళరావునగర్ చౌరస్తా, తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో బీజేపీ సీనియర్ నాయకులు ఏ.రామకృష్ణ, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, అనూహ రెడ్డి, కాలేరు రవీందర్, అల్లం ఈశ్వర్ చింతల శివకుమార్, ఎం.మురళి, వేణుగోపాల్ యాదవ్, సంగీత పాల్గొన్నారు.

మోదీపై లాలూ వ్యాఖ్యలు తగవు

బోరబండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీపై ఆర్‌జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖలను వెనక్కి తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బోరబండ బస్టాప్‌లో ఆర్‌జేడీ నేత లాలూ వ్యాకలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో 'నేను మోదీ కుటుంబ సభ్యుడిని' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బీజేపీ నాయకులు కొత్త వెంకటేశ్, కృష్ణమోహన్, చరణ్ రెడ్డి, రాజేందర్, వీరస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.



రూ.25వేలు అందజేస్తున్న సతీష్

సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని వినియోగించుకోండి

● ప్యారసాని శ్యామ్‌కుమార్

తిరుమలగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఒకటైన సుకన్య సమృద్ధి యోజన పథకంను వినియోగించుకోవాలని కంటోన్మెంట్ బోర్డ్ 7వ వార్డ్ మాజీ సభ్యులు ప్యారసాని శ్యామ్ కుమార్, ప్యారసాని భాగ్యశ్రీలు పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరగనున్న ఆధార్ కార్డు అప్‌డేట్ సెంటర్‌ను లాల్‌బజార్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. పేదవర్గాల చిన్నారుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మంచి సంక్షేమ పథకం అన్నారు. తిరుమలగిరి మలాని కాలనీకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సతీష్‌కుమార్ 100 మంది పేద చిన్నారుల ఖాతా ఓపెన్ చేయడానికి 25వేల రూపాయలను అందజేశారు. అదేవిధంగా ఆధార్ కార్డ్‌లో తప్పొప్పులు సరిచేసుకోవడానికి రెండు రోజులపాటు జరుగుతున్న మేళాను వినియోగించుకోవాలని సూచించారు. వార్డ్-7 బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, సత్యనారాయణగౌడ్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



జాష్టన్ జాన్

బౌద్ధనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వారాసిగూడ బ్రాహ్మణబస్తీలో నివాసముండే మమత కుమారుడు కె.జాష్టన్ జాన్(14) సైదాబాద్ చిల్డ్రన్ హోమ్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. చిల్డ్రన్‌హోమ్ నుంచి ఐదురోజుల క్రితం జాన్ ఇంటికి వచ్చాడు. ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి బాలుడు జాన్ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. తల్లి కుమారుడి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవటంతో ఆదివారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై సబిత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



అడ్డగుట్ట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు గోపాలపురం పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రోరైల్ పిల్లర్ 1167 నెంబరు కింద గుర్తుతెలియని 40 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా, ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న గోపాలపురం కానిస్టేబుల్ జగదీష్ ఘటనా స్థలికి చేరుకున్నాడు. చనిపోయి ఉన్న వ్యక్తి విషయంపై పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు

వినియోగదారుల హక్కులు, అవసరాలపై అవగాన ఉండాలి

బోయిన్‌పల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులు, అవసరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారుల హక్కులు మరియు అవసరాల గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కార్యక్రమాలు జరుపుతుంటారు. ఈ క్రమంలో బ్యూరో ఆఫ్ ఇండియా అనే సంస్థ మొట్టమొదటిసారి పాఠశాల స్థాయిలో విద్యార్థులకు, తల్లి తండ్రులకు అవగాహన కల్పించడానికి సోమవారం బోయిన్‌పల్లి బాలుర ప్రభుత్వ పాఠశాలలో వినియోగదారుల హక్కులు, అవసరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 10వేల రూపాయలు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బ్యూరో ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు కవిన్, ప్రభాకర్, సీహెచ్.శ్రీకాంత్, సౌజన్య, పాఠశాల ఉపాధ్యాయులు మధుమతి, సంధ్యారాణి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీఎండీ ముషరఫ్ ఫరూఖి

సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ట్రాన్స్‌కో సీఎండీ

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో పరిధిలో భారీగా విద్యుత్ డిమాండ్ నమోదవుతున్న తరుణంలో సీఎండీ ముషరఫ్ ఫరూఖి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మెట్రో జోన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ నిర్వహణ, పీటీఆర్ లోడ్, ఫీడర్ల నిర్వహణ పలు అంశాలను పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని, విద్యుత్ సరఫరా విషయంలో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ నర్సింహులు, ఇతర అధికారులు వెంట ఉన్నారు.

మహిళా శక్తి సదస్సుకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

సికింద్రాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న మహిళా శక్తి సదస్సుకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరయ్యే ఈ సదస్సుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం జరిగే సదస్సు దృష్ట్యా పరేడ్‌గ్రౌండ్‌తోపాటు సికింద్రాబాద్ వ్యాప్తంగా గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈపాటికే పరేడ్‌గ్రౌండ్‌ను పలుమార్లు పోలీసు అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్ష మంది వరకు స్వయం సహాయక సంఘాల మహిళలు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యారికేడింగ్, తాగునీటి సదుపాయం, బాత్రూమ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు.



పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లు



మహిళాశక్తి సదస్సును జయప్రదం చేయాలి

సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెన్నెల



సికింద్రాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనను తీసుకువచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేంద్రంలో కూడా ఇందిరమ్మ పాలనను తీసుకురావాలని, దీని కోసం కాంగ్రెస్ పార్టీని మరోసారి బలపరచాలని సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ జి.వెన్నెల విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అతి తక్కువ కాలంలోనే నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. సోమవారం ఆమె కంటోన్మెంట్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రానున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వేగంగా అడుగులు వేస్తూ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాటుపడుతున్నారని అన్నారు. ఈనెల 12వ తేదీన మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించనున్న మహిళాశక్తి సదస్సును విజయవంతం చేయాలని ప్రజలను ఆమె కోరారు. బీఆర్‌ఎస్, బీజేపీలు కంటోన్మెంట్ ప్రజలను నిర్లక్ష్యం చేశాయని, కంటోన్మెంట్ అభివృద్ధిని విస్మరించాయని ఆమె విమర్శించారు. మొదటి నుంచీ కంటోన్మెంట్ అభివృద్ధికి పాటుపడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని, ఈ చరిత్రను పునరావృతం చేస్తూ, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంటోన్మెంట్ పురోగతికి ప్రణాళికబద్ధంగా చర్యలు ప్రారంభించినట్టు వెల్లడించారు. పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మహిళాశక్తి సదస్సుకు కంటోన్మెంట్‌లోని అన్నివర్గాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు భారీ సంఖ్యలో తరలిరావాలని వెన్నెల పిలుపునిచ్చారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : పాకాల యాదగిరి

17న కొత్త కార్యవర్గం



భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో యూనియన్ నేతలు

అడ్డగుట్ట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ అడ్డగుట్ట డివిజన్ కార్యదర్శి పాకాల యాదగిరి సూచించారు. సోమవారం తుకారాంగేట్ సాయినగర్‌లోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో భవన నిర్మాణ బిల్డింగ్ వర్కర్ల సంఘం, సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో యూనియన్ నేతలు కార్మికుల ప్రత్యేక సమావేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పలు సంక్షేమ పథకాలపై ఎవరికీ అవగాహన లేకుండా పోయిందని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మికుల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాల్సిన బాధ్యత కార్మికులకు ఉందన్నారు. ఈనెల 17న భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో కొత్త కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే సమయంలో కార్మికులకు ఏదైన ప్రాణాపాయం జరిగితే ప్రభుత్వం నుంచి వచ్చే బీమా సౌకర్యం వృద్ధుల పింఛన్లు, అనేక సంక్షేమ పథకాలు కార్మికులకు అందుతున్నాయని, మీరు కూడా ప్రతి పథకానికి అర్హులేనన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడు గౌరి నాగరాజు, యూనియన్ నాయకులు ఖాసీం, బాలరాజ్, రవి, సింగారయ్య, సాయిలు, రమేష్, రామస్వామి, వీర, బాబు, మిల్లర్ రాములు పాల్గొన్నారు.

మంచినీటి, సివరేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో మంచినీటి, సివరేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో జోషి కాంపౌండ్ 35లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న సివరేజీ పైపులైన్ పనులను, 12లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న సీతాఫల్‌మండి రిజర్వాయర్ మరమ్మతు పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో మంచినీటి, సివరేజీ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని తెలిపారు. 2014 సంవత్సరం నాటిముందు పరిస్థితులతో పోల్చితే సికింద్రాబాద్ పరిధిలో మంచినీటి సరఫరా గణనీయంగా మెరుగుపడిందన్నారు. గతంలో 55ఎంఎల్‌డీ సామర్థ్యంలో మాత్రమే నీటిసరఫరా సాగేదని, ప్రసుత్తం 73ఎంఎల్‌డీల మేరకు సామర్థ్యం పెంచుకుని నీటిసరఫరాను పుష్కలంగా చేస్తున్నామని తెలిపారు. సీతాఫల్‌మండి రిజర్వాయర్‌ను పునర్నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కొత్త రిజర్వాయర్ నిర్మాణానికి నిపుణుల నుంచి నివేదికను సిద్ధం చేసి పక్షం రోజుల్లో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వై.కృష్ణ, కార్పొరేటర్ సామల హేమ, మేనేజర్ అన్విత్, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, కరాటే రాజు, రాజుసుందరం, జలంధర్‌రెడ్డి, మురళీ, నవీన్, మిట్టపల్లి బాబురావు, శైలేందర్, బొగ్గుల కృష్ణ, టీఆర్‌టీ శేఖర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



సివరేజీ పైపులైన్ నిర్మాణపనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్, ఫ్లో సభ్యులు

ఇంటి భోజనం ఆరోగ్యానికి మంచిది

సెలబ్రిటీ న్యూట్రిషియనిస్ట్ రుజుతా దివేకర్

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో దొరికే, సీజనల్ ఫుడ్స్‌తో పాటుగా మరీ ముఖ్యంగా ఇంటి భోజనం ఆరోగ్యానికి మంచిదని సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నలభై ఏళ్ల వయసు నుంచే ఆరోగ్యపరంగా గణనీయంగా మార్పులు చోటుచేసుకుంటాయని, ఈ వయసులో మహిళల కోసం 40+ మంత్ర వివరించారు. సరిగా తినకపోతే లేదంటే తినాల్సిన ఆహారం తినకపోతే పీరియడ్స్ సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని ఆమె వివరించారు. ఆకుకూరలు, శెనగలు, పెసరపప్పు, అరటిపండ్లు లాంటి తాజా పండ్లు లాంటివి తీసుకోవాలని సూచించారు. మంచి నిద్ర సౌందర్యానికి ముఖ్యమని, ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరని ఆమె సూచించారు. నేటి జీవనశైలి ఆరోగ్య సమస్యలు, వాటికి కారణాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్లో హైదరాబాద్ చైర్ పర్సన్ రీతు షాతో పాటుగా పెద్ద సంఖ్యలో ఫ్లో సభ్యులు పాల్గొన్నారు.

ఓ వ్యక్తి నుంచి మత్తుపదార్థాలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : బల్కంపేటలో ఓ వ్యక్తి నుంచి 5ఎల్‌ఎస్‌డీ పేపర్లు (మత్తుమందు) మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బల్కంపేట బీజేఆర్ నగర్‌కు చెందిన కుమ్మరి విశాల్‌సాయి లా విద్యను అభ్యసిస్తున్నాడు. ఎస్‌ఓటీ పోలీసులు విశాల్ సాయిని అదుపులోకి తీసుకొని అతని దగ్గర నుంచి ఎల్‌ఎస్‌టీ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

ప్యారడైజ్ హోటల్‌లో హలీం ఫెస్ట్



మాట్లాడుతున్న గౌతమ్ గుప్తా

రాంగోపాల్‌పేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ఉండే ఉపవాస దీక్షకనుగుణంగా సోమవారం ప్యారడైజ్ హోటల్‌లో హలీం ఫెస్ట్ ఘనంగా ప్రారంభమైంది. ఫెస్ట్‌ను ప్రారంభించిన ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ గౌతమ్ గుప్తా మాట్లాడుతూ... ప్యారడైజ్ బిర్యానీ హైదరాబాద్ ఎమోషన్‌కు పర్యాయపదంగా మారిందని, హైదరాబాద్ ప్రజలను ప్యారడైజ్ బిర్యానీ కట్టిపడేసిందని, ప్రతి సంవత్సరం రంజాన్ సందర్భంగా బంధు మిత్రులతో కలిసి ఒక చోట చేర్చే విధంగా తమ ఏర్పాట్లు ఉన్నాయన్నారు. తమ అవుట్‌లెట్‌లలో రుచితో పాటు నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సీఓఓ సిద్ధార్థ్ అరోరా మాట్లాడుతూ... ప్రతి సంవత్సరంలాగే ప్యారడైజ్ వారసత్వాన్ని కాపాడుకుంటూ ఉత్తమమైన బిర్యానీ, హలీంలను తీసుకొస్తున్నామన్నారు. ఏడాదిలో అత్యధిక బిర్యానీలను అందించినందుకుగాను ఆహారగొలుసు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానాన్ని సంపాదించామని, 2017లో 70 లక్షలకు పైగా, 2018లో 90 లక్షలకు పైగా బిర్యానీలను అందించామన్నారు. 2018లో ఇండియా ఫుడ్ ఫోరమ్‌లో గోల్డెన్ స్పూన్ అవార్డ్‌ను గెలుచుకోగా తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్, జీహెచ్ఎంసీ, టైమ్స్ ఫుడ్ అవార్డ్‌లతో పాటు అనేక ప్రశంసలను, పురస్కారాలను, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ, లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను అందుకున్నట్లు వివరించారు.

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌ను కలిసిన జవహర్‌నగర్ కమిషనర్

జవహర్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసినట్లు జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి తెలిపారు. జవహర్‌నగర్‌లోని సమస్యలను వివరించి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

సీజ్ చేసిన వాహనాలను తీసుకెళ్లండి

మల్కాజిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన 30 ద్విచక్రవాహనాలు ఉన్నాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. వాహనాల యజమానులు వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు చూపి వాహనాలను తీసుకవెళ్లాలని సూచించారు. ఇతర వివరాలకు 8712662463 ఫోన్ చేసి తెలుసుకోవచ్చని అన్నారు.

ఒత్తిడిని అధిగమించి విధులు నిర్వర్తించాలి

● డాక్టర్ షణ్ముఖప్రియ

చిలకలగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, రైల్‌నిలయం ఆడిటోరియంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ అతిథులుగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది బి.కవితా యాదవ్, డాక్టర్ షణ్ముఖప్రియ, డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ (సికింద్రాబాద్) అనూష విచ్చేసి ప్రసంగిస్తూ కుటుంబం, ఆఫీస్ పనిలో ఒత్తిడికి గురి కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రైలు నడపటం నుంచి చంద్రయాన్ విజయంలో మహిళల పాత్రను కొనియాడారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధవహిస్తూ విధులు నిర్వహించాలని కోరారు. డాక్టర్ షణ్ముఖప్రియ, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మహిళ ఒత్తిడి కారణాలు అధిగమించటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. మంచి పుస్తకాలు చదవటం, సంగీతం వినటం, ఆటలు, యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చునని తెలిపారు. సమయానికి ఆహారం తీసుకోవడం మైదా, ఉప్పు తగ్గించడం, క్రమం తప్పకుండా నడక వల్ల చక్కని ఆరోగ్యంతో ఉండవచ్చని తెలిపారు. ఆరోగ్యమైన మహిళలు వారి ఎత్తు ప్రకారం బరువు వుండటానికి చర్యలు చేపట్టాలని పండ్లు, ఆకు కూరలు అధికంగా తీసుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పి.కిషోర్‌బాబు మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల భద్రతకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే తక్షణం పరిష్కరిస్తానని తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి కాల్వ శ్రీనివాస్, సీ.హెచ్. శంకర్‌రావులు మాట్లాడుతు మహిళా ఉద్యోగులకి పనిప్రదేశాల్లో భద్రత, మెరుగైన సౌకర్యాలు కల్పించటానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సరోజినీరెడ్డి, విజయలీల, డి.మంజులతరావు, చింతకుంట రామకృష్ణతోపాటు మహిళా ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో బి.కవితా యాదవ్, డాక్టర్ షణ్ముఖప్రియ, శంకర్‌రావు తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ.గాలి వినోద్ కుమార్ తదితరులు

14న దళిత క్రైస్తవ గర్జన సభ

● ప్రొ.గాలి వినోద్‌కుమార్

తార్నాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈనెల 14న మహబూబ్‌నగర్‌లో దళిత క్రైస్తవ గర్జన సభను నిర్వహిస్తున్నట్లు దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం దళిత క్రైస్తవ దండోరా ప్రతినిధులతో కలిసి ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో దళిత క్రైస్తవులపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నా ఇప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు కోటికిపైగా ఉన్న దళిత క్రైస్తవులను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 పార్లమెంట్ స్థానాల్లో దళిత క్రైస్తవులను పోటీకి నిలబెట్టి తమ సత్తా చాటి చెబుతామని ఘాటుగా హెచ్చరించారు.



భగత్‌సింగ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ విద్యార్థి నాయకులు

18 నుంచి ఓయూలో భగత్‌సింగ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్

తార్నాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 20వరకు ఉస్మానియా యూనివర్సిటీలో భగత్‌సింగ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఏఐవైఎఫ్ విద్యార్థి నాయకులు టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను హబ్సిగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక భూమిక పోషించిన భగత్‌సింగ్‌ను స్మరిస్తూ ఈనెల 18, 19, 20న మూడు రోజులపాటు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే యువకులు 9347279087 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ విద్యార్థి నాయకులు భరత్, కీర్తన్, ప్రదీప్, రాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మలేషియా అంతర్జాతీయ శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ ఉగాది పురస్కారాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మిరియాల జానికిరామ వరప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్య, వైజ్ఞానిక, విజ్ఞాన, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సేవా, సినీ, క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మార్చి 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని మే 10న మలేషియాలోని కౌలాలంపూర్‌లో పురస్కారాలు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగినవారు 9666910480 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



మంగమ్మ బంధువులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేత

మల్కాజిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి డివిజన్ నర్సింహారెడ్డి నగర్‌కు చెందిన మంగమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న మహిళకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆస్పత్రిలో వైద్య ఖర్చులకు లక్ష రూపాయల ఎల్‌ఓసీని సోమవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రోడ్ల సమస్యను పరిష్కరించాలి

మౌలాలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీలో రోడ్ల సమస్యను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి దానిని పరిష్కరించాలని కోరినట్లు కాలనీవాసులు తెలిపారు. ఆర్టీసీ కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మూడు నెలల క్రితం 80 లక్షలతో ఆర్టీసీ కాలనీ నుంచి షఫీనగర్ వరకు మూడు చోట్ల ప్యాచ్ వర్క్‌లు చేపడతామని అధికారులు రోడ్ల పనులు చేపట్టి అర్థాంతరంగా వదిలేశారు. అలాగే ఆర్టీసీ కాలనీ నుంచి హనుమాన్‌నగర్ అంతర్గత సీసీ రోడ్డును సైతం నిలిపివేశారని గుర్తు చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు అజయ్, సంతోష్‌గుప్తా, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

మచ్చబొల్లారంలో పర్యటన

మచ్చబొల్లారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్ మల్లికార్జున్‌నగర్‌లో సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్డు, వీధి దీపాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కాలనీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన పనులకు బిల్లులు ఇవ్వరా?

● కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన సివిల్ కాంట్రాక్టర్లు

మల్కాజిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ పద్ధతిన పనులు నిర్వహించిన తమకు ఇంత వరకు బిల్లులు చెల్లించడం లేదని, తక్షణమే తమకు బిల్లులు ఇప్పించాలంటూ సివిల్ కాంట్రాక్టర్లు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మల్కాజిగిరి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటింగ్ కేంద్రాల వద్ద కుర్చీల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, టెంట్లు, స్ట్రాంగ్ రూంల వద్ద, కౌంటింగ్ సెంటర్ల వద్ద ఈవీఎంలను భద్రపరిచే రూంల వద్ద పనులు నిర్వహించారు. ఈ పనులకు సంబంధించి రూ.60లక్షలు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ డబ్బులు జనవరిలోనే ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఇంతవరకు మల్కాజిగిరి అసెంబ్లీకి సంబంధించి పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లకు మాత్రం ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే జిల్లా కలెక్టర్ పేషీ అధికారులు మాత్రం జనవరిలోనే మీ బిల్లులు సాంక్షన్ చేశామని రిటర్నింగ్ అధికారి వద్ద అడిగి తీసుకోవాలంటూ సమాధానం చెప్పినట్లుగా తెలిసింది. ఇప్పటికైన సదరు పనులు చేసిన సివిల్ కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వాలని పలువురు కాంట్రాక్టర్లు కోరుతున్నారు.